నేడు నాగారంలో విజయోత్సవ ర్యాలీ

కీసర: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత, బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ నెల22న నాగారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నేత నక్కా ప్రభాకర్‌గౌడ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రాంపల్లి చౌరస్తా నుంచి దమ్మాయిగూడ పీఎస్‌రావు నగర్ వరకు ర్యాలీ ఉంటుందని నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అవుషాపూర్‌లో డ్రైనేజీ పనులు షురూ



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో డ్రైనేజీ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయని స్థానికుల విన్నపం మేరకు గత కౌన్సిల్ నిధులు కేటాయించింది. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ నాయకులు మాధవరెడ్డి, జంగయ్య ముదిరాజ్, జంగయ్య యాదవ్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, నాగరాజు ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, చందు, సునీల్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా

కీసర: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెనూ ప్రకారంగా విద్యార్థులకు భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

ఎమ్మార్‌సీఈ కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో 5 రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ, కళాశాల వెల్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ స్కిల్స్ పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో సంస్థ ప్రతినిధులు పరుల్ ఖురాణ, దీపక్ లంక పాల్గొని నైపుణ్యాలు ఎలా పెంచుకోవాలని అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, వెల్‌నెస్ క్లబ్ కన్వీనర్ శాంతిలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో కార్పొరేటర్ పర్యటన



అల్వాల్: అల్వాల్‌లో తాగునీటి లీకేజీ అవుతుందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రేమ్, యాదగిరి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మృతి

కీసర: నాగారం మున్సిపాలిటీ 16వ వార్డు మాజీ కౌన్సిలర్ బదనపురం శ్రీనివాస్(50) శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందాడు. అతని భార్య లత రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. దీంతో మనస్థాపానికి గురైన అతను కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

'పది' పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- దుండిగల్, శామీర్‌పేట్ సెంటర్ల తనిఖీ



పరీక్షా కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకు సజావుగా జరిగేలా చూడాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సిబ్బందిని ఆదేశించారు. దుండిగల్, శామీర్‌పేట మండలాల్లోని పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా దుండిగల్ మండలంలోని మల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు ఉన్నాయా..? అని ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శామీర్‌పేట మండలంలోని తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో దుండిగల్, శామీర్‌పేట్ తహసీల్దార్లు మతీన్, యాదగిరిరెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 99.72 శాతం మంది హాజరు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 230 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కాగా, 99.72 శాతం విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి తెలిపారు. జిల్లాలో మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 47,329 మంది ఉండగా 47,195 మంది హాజరు కాగా 134 మంది గైర్హాజర్ అయినట్లు తెలిపారు. అలాగే 140 మంది ప్రైవేట్ విద్యార్థులకు 113 హాజరు కాగా 27 మంది పరీక్షలు రాయలేదని పేర్కొన్నారు. కీసర మండల కేంద్రంలోని ఓ కేంద్రంలో వసతులు సరిగా లేవని ఫిర్యాదు అందిన వెంటనే పరిష్కరించామని తెలిపారు. ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా కూడా అందిన ఫిర్యాదులపై ఆమె తక్షణమే స్పందించి సంబంధిత ఎంఈఓ ద్వారా పరిష్కారమయ్యేలా ఆదేశాలిచ్చారు. పరీక్షా పత్రాల తరలింపు తదితర వాటిని డీఈఓ ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

ఎన్నికల విషయాలపై తరచూ చర్చిద్దాం

- మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్
- పార్టీల ప్రతినిధులతో సమావేశం

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల సమయంలోనే కాకుండా తరచూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి సలహాలు, సూచనలను పరిగణలోనికి తీసుకుని భారత ఎన్నికల కమిషన్‌కు పంపుతామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ వీసీ హాల్‌లో పార్టీల ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జనాభాతో పాటు ఓటర్ల సంఖ్య పెరుగుతుందని అందుకనుగుణంగా బూత్ లెవెల్ ఏజెన్సీలను నియమించాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఓటరు జాబితాను అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేస్తూ మార్పుల వివరాలను బీఎల్ఏలు ఓటర్లకు తెలపాలని పేర్కొన్నారు. సాధారణ అభ్యర్థనలు ఏమైనా ఉంటే కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. బూత్‌లను షిఫ్ట్ చేయడం కష్టమని, అవసరమైన మేరకు కొత్త పోలింగ్ బూతులు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు బూతుల్లో ఓటరుగా నమోదు ఉంటే వారు ఫామ్–8 లో బూతు మార్పునకు అప్లై చేసుకోవచ్చని సూచించారు. పార్టీ ప్రతినిధుల సూచనల మేరకు తండాలను పరిశీలించి అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇంకా ఏవైనా సందేహాలు ఉంటే తప్పనిసరిగా క్లియర్ చేసుకోవాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

కీసర: ఉమ్మడి మండలంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 13 సెంటర్లలో 2,814 మంది విద్యార్థులకు 2,807 మంది హాజరైనట్లు ఎంఈఓ శశిధర్ తెలిపారు. ఆయా సెంటర్ల వద్ద విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు ఇతర వసతులు కల్పించామని పేర్కొన్నారు. కాగా నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి నాగారం కేంద్రం వద్ద విద్యార్థులకు ఆల్‌దిబెస్ట్ తెలిపారు.

శామీర్‌పేట మండలంలో..

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండలంలో 7 సెంటర్లలో పరీక్షలు నిర్వహించామని ఎంఈఓ తెలిపారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలకు చెందిన 1408 మంది విద్యార్థులకు 1406 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

మేడ్చల్ మండలంలో..

మేడ్చల్‌లోని 11 కేంద్రాల్లో 2,300 మంది విద్యార్థులకు 2,297 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శామీర్‌పేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీలోని వేంకటేశ్వర కాలనీలో వారం రోజులుగా గుర్తు తెలియని వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం వేంకటేశ్వర కాలనీలో గల ఓపెన్ ప్లాట్‌లో విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారించగా వారం రోజులుగా సమీప ప్రాంతాల్లో సంచరిస్తున్నాడని, వడదెబ్బ వల్ల చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు గోడ కూలి ముగ్గురికి గాయాలు

కీసర: ప్రమాదవశాత్తు గోడ కూలి ముగ్గురు కూలీలు గాయపడిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. కీసర సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. అహ్మద్‌గూడలోని పటేల్ ఫామ్‌హౌజ్‌లో నిర్మాణంలో ఉన్న గోడ కూలి అక్కడే పనిచేస్తున్న చెన్నాపురానికి చెందిన కూలీలు బస్వప్ప (54), శరణప్ప (30) లక్ష్మణ్ (32)పై పడింది. పక్కనే ఉన్న కూలీలు గమనించి గోడ రాళ్లను తొలగించి వారిని బయటకు తీశారు. సమాచారం అందుకున్న కీసర 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలు అందించారు. బస్వప్ప పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. బస్వప్ప, శరణప్ప తండ్రీ, కుమారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంపై హర్షం



నారపల్లిలో ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోచారం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లులు చట్ట సభల్లో ఆమోదం పొందడంతో పోచారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నారపల్లిలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీ కులగణన నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ కోసం దశాబ్దాలుగా ఉద్యమాలు జరిగాయని ఎట్టకేలకు ఈ రెండు బిల్లులు చట్టసభల్లో ఆమోదం పొందడంలో సీఎం రేవంత్‌రెడ్డి చెరగని ముద్ర వేశారన్నారు. నారపల్లిలోని జాతీయ రహదారిపై ఉన్న మసీదు నుంచి కొర్రెముల్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్, సీనియర్ నాయకులు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కొంతం శంకర్‌రెడ్డి, బాలగోని వెంకటేశ్ గౌడ్, మెట్టు నర్సింహారెడ్డి, బద్దం వెంకట్‌రెడ్డి, బద్దం నర్సింహారెడ్డి, మెట్టు గణేశ్ యాదవ్, భోజిరెడ్డి, మహ్మద్ యూసుఫ్, వినోద్, పోలగోని ప్రభాకర్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సింపోజియం..ఉత్సాహం..

ఓయూలో ప్రారంభమైన నేషనల్ టెక్నికల్ సింపోజియాలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో నేషనల్ టెక్నికల్ సింపోజియాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాలలోని సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, బయోమెడికల్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాలలో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలతో ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. వీసీ ప్రొ.కుమార్, రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.మంగు ఆయా కార్యక్రమాలలో అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

- ఆకృతి–2025 పేరుతో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాక్ చిప్ టెక్నాలజీ ఎండీ, సీఈవో ముఖ్యఅతిథిగా హాజరుకాగా హెడ్ ప్రొ.రామకృష్ణ, స్టూడెంట్స్ కన్వీనర్లు రాహుల్ కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.
- టెక్నోనెన్స్–2025 పేరుతో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీఎస్‌పీడీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వరుణ్‌రెడ్డి,గౌరవ అతిథిగా ఈఈఈ పూర్వవిద్యార్థి గోపాల్ టీకే కృష్ణ, హెడ్ ప్రొ.విద్యాసాగర్, కోఆర్డినేటర్లు డా.శిరీష, డా.సుశీల, స్టూడెంట్స్ కోర్డినేటర్ జశ్వంత్, దక్షిణ్యా తదితరులు పాల్గొన్నారు.
- మెడిటెక్–2కె25 పేరుతో బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ డీన్, సీనియర్ ప్రొ.కృష్ణయ్య, న్యూరోసర్జన్ డా.రమేష్, ప్రత్యేక ఆహ్వానితులు రాజేంద్ర ప్రకాష్, హెడ్ ప్రొ.మాళిని, కోఆర్డినేటర్ డా.మేడి శ్రీనివాస్, స్టూడెంట్స్ కోర్డినేటర్స్ ఎస్‌పీ శ్రీక్రాంత్, అధ్యాపకులు డా.సుమన్, డా.విద్యాసాగర్, డా.శ్రవణ్య, డా.హరీష్, కిరణ్, గాయత్రి పాల్గొన్నారు.
- మెకానికల్ ఇంజినీరింగ్‌లో మెఖరీణ–2025 పేరుతో జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొ.కుమార్, డా.నాయిని కిశోర్‌నాథ్, హెడ్.ప్రొ.హద్యా, ఫ్యాకల్టీ అడ్వైజర్ ప్రొ. శివ రామకృష్ణ, డా.వెంకటేశ్వర్లు, డా.ఉదయ్ కిరణ్, డా.బుచ్చయ్య, డా.నాగవేణి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.
- కంప్యూటర్ సైన్స్‌లో ఇన్ఫినిటీ–2025 పేరుతో, సివిల్ ఇంజినీరింగ్‌లో నిర్మాణ్–2025 పేరుతో, మైనింగ్ ఇంజినీరింగ్‌లో ఇన్మైట్–2కె25 పేరుతో రెండు రోజుల సింపోజియాలను ప్రారంభించారు. సదస్సుల్లో లైవ్ ఎగ్జిబిషన్స్, పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్స్, వివిధ అంశాలపై చర్చ, డాన్సులు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఓయూ అధికారులు తెలిపారు.

'సిమాప్'లో ముగిసిన శిక్షణ తరగతులు

బోడుప్పల్: సీఎస్ఐఆర్ ఆరోమా మిషన్ ప్రాజెక్ట్ ఆర్థిక సహకారంతో కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా కేంద్రం (సిమాప్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా శాస్త్రవేత్త, ఇన్‌చార్జి జి.డి. కిరణ్‌బాబు హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, మహారాష్ట్రా నుంచి 70 మంది శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారన్నారు. వారికి సుగంధ, ఔషధ పంటల పెంపకం, ప్రాసెసింగ్ పద్ధతులు, వాటి ఆధారిత ఉత్పతులు, నాణ్యత, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించామన్నారు. సుగంధ తైలాల ట్రేడర్స్, డిస్టిలేషన్ యంత్రాల తయారీదారులు పాల్గొనగా రైతులకు ఉత్పత్తుల కొనుగోలుకు, నాణ్యమైన యంత్రాల సరఫరాకు వారు భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు పంటల సాగుకు ఆసక్తి కనబర్చినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.



రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

- కాలం చెల్లిన పదార్థాలు ధ్వంసం, మరికొన్ని సీజ్
- నోటీసులు జారీ, పరీక్షల కోసం ల్యాబ్స్‌కు తరలింపు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పసుపు, కారం, మసాలాల తయారీ, నిల్వ, విక్రయ కేంద్రాలు, పలు రెస్టారెంట్లపై రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్నింటిని సీజ్ చేయటంతో పాటు మరికొన్నింటిని ధ్వంసం చేశారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్, శ్రీశిక, పి.స్వాతి, జగన్నాథ్‌తో కూడిన బృందం మేడ్చల్ జిల్లాలోని కిష్టాపూర్ సర్వే నంబర్ 819 , హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సూర్య మసాలా మరియు స్పైసెస్)లో తనిఖీలు నిర్వహించారు. మసాలా పొడుల ఉత్పత్తి, నిల్వ విభాగాల్లో పరిశుభ్రత లేకపోవడం, అలాగే మసాలా ఉత్పత్తి ముడి పదార్థాలపై లేబుల్ సమాచారం లేదని తదితర వాటిని గుర్తించారు. నిర్వహణ విభాగంలో సరైన రికార్డులు కూడా లేవని వారు పేర్కొన్నారు. 46.75 క్వింటాళ్ల తయారైన సెమీ ఆహార పదార్థాలు (పికిల్స్, అల్లం–వెల్లుల్లి పేస్ట్), మసాలా పొడులు కలిగి ఉన్న రూ. 3 .03 లక్షల విలువైన నిల్వను సీజ్ చేసి, లోపభూయిష్టమైన నమూనాలను ల్యాబ్‌కి పంపించినట్లు పేర్కొన్నారు. సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. నివేదికలో కల్తీ అని నిర్ధారణ అయితే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని టాస్క్‌ఫోర్స్ ఫుడ్‌సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, రవాణా చేసి, విక్రయించే వ్యాపారులు ప్రజలకు సురక్షిత ఆహారం అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు నోటీసులు, సూచనలు జారీ చేశారు. అనుమతుల్లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని టీం హెడ్ వి.జ్యోతిర్మయి హెచ్చరించారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద సౌకర్యాల కల్పనకు కృషి



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర: రాంపల్లి పరిధిలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత సహకారంతో రాంపల్లి డబుల్‌బెడ్రూం ఇళ్ల వరకు బస్సు సౌకర్యం కల్పించగా, శుక్రవారం ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం లబ్దిదారులు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వం తరపున వారికి కావాల్సిన వివిధ సౌకర్యాలు కల్పించే వీలుంటుందన్నారు. షాపింగ్‌మాల్, హెల్త్‌సెంటర్ ఏర్పాటు, తాగునీటి సరఫరా తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం' పథకానికి దరఖాస్తు చేసుకోండి

సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువత 'రాజీవ్ యువ వికాసం ' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఏడీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21–55 ఏళ్ల మధ్యనున్న అభ్యర్థులు ఉపాధి హామీ పథకానికి, 21–60 ఏళ్లు కలిగి ఉన్న అభ్యర్థులు భూసంబంధ, ఉద్యానవన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంవత్సర ఆదాయం (గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్ష, పట్టణ/మున్సిపాలిటీ వారికి రూ.2 లక్షలకు మించి ఉండవద్దన్నారు. మీ–సేవ నుంచి పొందిన కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 5 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంతో సహా 040–24020610 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ పథకానికి..

ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కింద ఉపకార వేతనాల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా వచ్చే నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



కీసరలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు

కీసర: గ్రామాల్లోని ఆశా కార్యకర్తల కనీస వేతనం రూ. 26 వేలకు పెంచడంతో పాటు ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ మల్కాజ్‌గిరి జిల్లా నాయకురాలు జయప్రద డిమాండ్ చేశారు. కీసర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా చేపట్టామని తెలిపారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు రాధా, యాదమ్మ, పుణ్యవతి, మంగ, భాగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు

అల్వాల్: కారు ఢీకొని వృద్ధుడు గాయపడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్ కాలనీలోని నిర్మల సదన్ భవనంలో నివసించే దుర్గాప్రసాద్ (57) ప్రైవేట్‌గా ఉద్యోగం చేసి ప్రస్తుతం ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం వెంకటాపురంలోని వైష్ణవిమాతా ఆలయం అమ్మవారిని దర్శించుకుని రోడ్డుపైకి వచ్చాడు. ఇదే సమయంలో వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టడంతో గాయపడ్డాడు. కారు డ్రైవరు కొన్ని క్షణాలు ఆపి వేగంగా పరారయ్యాడు. కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని సికింద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విశ్వశనీయ సమాచారం మేరకు కారు డ్రైవర్ స్థానికుడేనని తెలుస్తోంది. సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

పోక్సో బాధితులకు భరోసా కల్పిస్తాం



భరోసా కేంద్రంలో వర్చువల్ ఎవిడెన్స్ సేవలు ప్రారంభిస్తున్న మేడ్చల్ డీసీపీ



వర్చువల్ వీడియో రికార్డింగ్ తీరును పరిశీలిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్‌రూరల్: పోక్సో కేసు బాధితులు స్వేచ్ఛగా తమ వాంగ్మూలం ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. మేడ్చల్ పట్టణంలోని భరోసా కేంద్రంలో వర్చువల్ ఎవిడెన్స్ సేవలను బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోక్సో కేసులో బాధితులు బయటకు తెలియకుండా కోర్టుకు వెళ్లకుండానే భరోసా కేంద్రం నుంచే వర్చువల్ గా వీడియో రికార్డింగ్‌తో తమ వద్ద ఉన్న ఆధారాలు కోర్టుకు సమర్పించవచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని పేర్కొన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్, బాలానగర్ జోన్‌ల పరిధిలో వచ్చే కేసులను ఈ కేంద్రం స్వీకరిస్తుందని తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన మాట్లాడుతూ.. 2022 మార్చిలో ప్రారంభమైన ఈ కేంద్రం ప్రత్యేకంగా మహిళల కోసం పనిచేస్తుందని తెలిపారు. లైంగిక కేసులు, పోక్సో కేసు బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా నేరుగా ఇక్కడికి తీసుకువచ్చి వారి స్టేట్‌మెంట్ రికార్డు, మెడికల్ టెస్టులు, అవగాహన కల్పించడం వంటి అన్నింటిని భరోసా కేంద్రం సిబ్బంది చూసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికి వరకు భరోసా కేంద్రంలో 281 కేసులు నమోదయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, మేడ్చల్ డీఐ సుధీర్ కృష్ణ, ఎస్ఐలు మన్మధ్, అశోక్, అనిత, భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.